సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



బోనం.. ఘనం

గ్రామాల్లో సోమవారం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. 8లో▸



విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో షాద్ నగర్ పట్టణానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. 8లో▸



సేవలు చిరస్మరణీయం

దివంగత రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీపాతి వీరారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని అతిథులు పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఉదయనిధి వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించాలి

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



మీడియాతో మాట్లాడుతున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ ఖండించారు. ఆలయం ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వేదమే ఆధారమైనటువంటి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడటం అంటే శ్రీరాముడు, శ్రీకృష్ణుడికి వ్యతిరేకంగా మాట్లాడటమేనని అన్నారు. రాజ్యాంగంలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడి ఫొటోలు పెట్టుకున్నామని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వాఖ్యలు చేసినందుకు సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని కోరారు. తాము మాత్రం కోర్టుకు వెళ్లమని స్పష్టం చేశారు. సనాతన ధర్మాన్ని గౌరవించేవారిని, నమ్మేవారినే ఎన్నుకోవాలని తమిళనాడు భక్తులకు సూచిస్తున్నామన్నారు.

ప్రజావాణికి 250 అర్జీలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 250 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

బీజేపీ మహేశ్వరం టికెట్ కోసం దరఖాస్తు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మహేశ్వరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు.

ఔటర్‌పై ఒకదాని వెనుక ఒకటి.. ఆరు కార్లు ఢీ

మణికొండ: ఓ వైపు వర్షం..కమ్ముకున్న కారు మబ్బులు..ముందు వెళ్తున్న కార్లు సరిగా కనిపించకపోవటం..రహదారులపై నిలిచిన వరద నీటి కారణంగా..ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్న ఆరు కార్లు వెనక నుంచి ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్‌కు సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తుండగా.. నార్సింగి కాకతీయ స్థూపం సమీపంలో రోడ్డుపై నీరు నిలిచి ఉండటంతో ముందుగా వెళ్తున్న ఓ కారు డ్రైవర్ అకస్మాత్తుగా వేగం తగ్గించాడు. దాంతో దాని వెనక వస్తున్న కారు దాన్ని ఢీ కొట్టింది. అదే తరహాలో మరో నాలుగు కార్లు వచ్చి ఢీ కొట్టాయి. కార్లలో ఉన్న వారికి ఎవరికీ గాయాలు కాకపోవటంతో వారంతా ఇతర వాహనాల్లో వెళ్లిపోయారు. ప్రమాదానికి గురైన కార్లలో రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌కు చెందిన ఇన్నోవా కారు కూడా ఉంది. విషయం తెలుసుకున్న ఔటర్ రింగ్ రోడ్డు సిబ్బంది వాటిని వెంటనే అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్ వైద్యులకు పదోన్నతులు

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) వైద్యులకు సీనియర్ ప్రొఫెసర్లుగా యాజమాన్యం పదోన్నతి కల్పించింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల అంశానికి ఎట్టకేలకు మోక్షం కల్పించడంతో 15 మంది ప్రొఫెసర్లకు ప్రయోజనం కలిగింది. దీంతో నిమ్స్ సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో పాటు కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఓ.సాయి సతీష్, జనరల్ మెడిసిన్ వైద్యులు వై.సత్యనారాయణ రాజు తదితరులకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించాయి.



షాబాద్: నిండుగా ప్రవహిస్తున్న ఈసీ వాగు



యాచారం: రోడ్డుపై భారీగా నిలిచిన వరద నీరు

సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకు వర్షపాతం

మండలం	వర్షపాతం (సెంటీమీటర్లలో)
శంకర్‌పల్లి	4.2
కొందుర్గు	3.45
శేరిలింగంపల్లి	2.94
చౌదరిగూడ	2.93
శంషాబాద్	2.68
చేవెళ్ల	2.57
మహేశ్వరం	2.43
గండిపేట	2.25
హయత్‌నగర్	1.98
సరూర్‌నగర్	1.97
బాలాపూర్	1.93
అబ్దుల్లాపూర్‌మెట్	1.92
షాబాద్	1.84
ఫరూఖ్‌నగర్	1.82
ఇబ్రహీంపట్నం	1.77
రాజేంద్రనగర్	1.65
నందిగామ	1.50
మంచాల	1.39
కేశంపేట	1.29
కొత్తూరు	1.08
కందుకూరు	1.08

దంచికొట్టింది

నెల రోజుల తర్వాత ఏకధాటి వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వాడిపోయిన పంటలకు ఊపిరి
- రోడ్లపై ట్రాఫిక్ జాం.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నెల రోజుల క్రితం ముఖం చాటేసిన వరుణుడు మళ్లీ దంచికొడుతున్నాడు. ఆదివారం ఉదయం చిరు జల్లులతో మొదలైన వర్షం.. సోమవారం మధ్యాహ్నం సరికి భారీగా నమోదైంది. అత్యధికంగా శంకర్‌పల్లిలో 4.02 సెంటీమీటర్లు, అత్యల్పంగా తలకొండపల్లి మండలంలో 0.30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. నిన్న మొన్నటి వరకు వట్టిపోయిన వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పంట చేలు నీటమునిగాయి. శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో అధిక వర్షానికి కూరగాయ పంటలు, పూలతోటలు దెబ్బతినగా, వర్షాభావంతో ఇతర ప్రాంతాల్లో వాడిపోయిన ఇతర వాణిజ్య పంటలు మళ్లీ ఊపిరి పోసుకున్నాయి. ఈదురుగాలితో కూడిన వర్షానికి చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలి ఆయా సబ్‌స్టేషన్లలో ఫీడర్లు ట్రిప్పయ్యాయి. ఫలితంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్టణ ప్రాంతాల్లో రెండు మూడు గంటల్లోనే పునరుద్ధరించినప్పటికీ.. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. పలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వీధులు బురదమయంగా మారాయి. వర్షానికి ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా ఆనుకుని ఉన్న ప్రధాన మార్గాలన్నీ ట్రాఫిక్‌తో రద్దీగా మారాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి తోడు అతివేగం కారణంగా నార్సింగి ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనాలు అదుపు తప్పాయి. ఒకదాని కొకటి ఆరు ఢీ కొట్టాయి. ఆయా వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

మొక్క.. సైకిళ్లపై ఎంచక్కా..



మీర్‌పేట: ఇంట్లో ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలంలో.. గోడలపై, ఇంటి పైకప్పుపై మొక్కల పెంపకాన్ని చూశాం.. అక్కడ మాత్రం వినూత్నంగా సైకిళ్లపై మొక్కల పెంపకం స్థానికంగా అందరినీ ఆకట్టుకుంటోంది. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి వినాయక నగర్ కాలనీలో నివసించే జూపల్లి ప్రసాద్ రావు ఇద్దరు కుమార్తెలకు మొక్కల పెంపకంపై మక్కువ. ఇంట్లో రకరకాల పూలు, ఇతర మొక్కలను పెంచుతున్నారు. గతంలో తాము ఉపయోగించిన సైకిళ్లు పాడైపోవడంతో స్క్రాప్‌నకు తరలించకుండా ఇంటి ముందు ఉంచి రకరకాల మొక్కల కుండీలను వాటికి అమర్చి మొక్కలను సంరక్షిస్తున్నారు. ఎవరైనా ఈ వీధికి వెళ్తే మొదటగా సైకిల్‌పై అమర్చిన మొక్కలే దర్శనమిస్తాయి.



కిసాన్‌మోర్చా సమ్మేళనానికి అంతా సిద్ధం



ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

- హాజరుకానున్న బీజేపీ ప్రముఖులు
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగే కిసాన్ మోర్చా రాష్ట్రస్థాయి సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమ్మేళనానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చాహర్, తరుణ్‌చుగ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరుకానున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్‌తో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతినిధులు హాజరయ్యే కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వారి వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ నారాయణ యదవ్, అసెంబ్లీ కన్వీనర్ ఎన్నుయాదగిరిరెడ్డి, గీతా సెల్ కన్వీనర్ లక్ష్మీపతిగౌడ్, మీడియా సెల్ కన్వీనర్ అశోక్ తదితరులు ఉన్నారు.

‘గురునానక్’ వద్ద మళ్లీ ఉద్రిక్తత

- ఓరియంటేషన్‌కు అడ్డుపడిన విద్యార్థులు, పేరెంట్స్
- యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు

ఇబ్రహీంపట్నం: గురునానక్ కళాశాల వద్ద మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. యూనివర్సిటీ పేరుతో అడ్మిషన్లు తీసుకొని తమ జీవితాలతో యాజమాన్యం చెలగాటమాడుతోందని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ కోహ్లి హాజరయ్యారు. విషయం తెలుసుకున్న యూనివర్సిటీలో ఎంసీఏ, బీసీఏ, బయోటెక్నాలజీ, అగ్రికల్చర్, పారా మెడికల్, కార్డియాలజిస్ట్, ఫిజియోథెరపీ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు పొందిన సుమారు వంద మంది విద్యార్థులు వారి పేరెంట్స్ అక్కడికి చేరుకున్నారు. ఓరియంటేషన్‌కు అడ్డుతగిలారు. తమకు న్యాయం చేయాలని, విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలంటూ నినదించారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి పక్కకు తీసుకొచ్చారు. అనంతరం కోహ్లితో విద్యార్థులు, వారి పేరెంట్స్ వాగ్వాదానికి దిగారు. తమ పిల్లల జీవితాలతో ఆటలాడొద్దని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అనుమతికి సంబంధించిన జీవో జారీ కానందున ప్రభుత్వం ఇతర కళాశాలకు విద్యార్థులను బదిలీ చేసిందని, దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని కోహ్లి చెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



విద్యార్థులు, పేరెంట్స్ ఆందోళన

నేడు ఉత్తమ గురువులకు సన్మానం

- రాష్ట్ర స్థాయిలో ముగ్గురు.. జిల్లా స్థాయిలో 164 మంది ఎంపిక
- జెడ్పీలో వేడుకలు.. హాజరుకానున్న మంత్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అత్యుత్తమ బోధనతో విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న పలువురు ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించింది. ఈనెల 5న (మంగళవారం) సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించాలని నిర్ణయించింది. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారిని రవీంద్రభారతిలో సన్మానించనుండగా, జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే వేడుకల్లో సన్మానించనుంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పి.సబితారెడ్డి సహా గనులు భూగర్భశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్) పల్లె అనంతరెడ్డి, చంపాపేట్ ఎంపీపీఎస్ ఎల్‌ఎఫ్‌ఎల్ మంచిరెడ్డి అనంతరెడ్డి, పహాడీషరీఫ్ జెడ్పీహెచ్‌ఎస్ సోషల్ టీచర్ మహ్మద్ గులాం దస్తగిరి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో 164 మంది ఎంపికయ్యారు. వీరిలో 63 మంది ఎస్‌జీటీలు, ఐదుగురు పీఈటీలు, ఆరుగురు లాంగ్వేజ్ పండిట్స్, ముగ్గురు ఎల్‌పీహెచ్‌లు, 16 మంది ప్రైవేటు టీచర్లు, టీఎస్‌ఎంఎస్, కేజీబీవీల నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున ఉన్నారు. ముగ్గురు పీడీలు, ఆరుగురు తెలుగు స్కూల్ అసిస్టెంట్స్, తొమ్మిది మంది సైన్స్, ఐదుగురు ఫిజిక్స్, 11మంది మ్యాథ్స్, ఇద్దరు హిందీ, తొమ్మిది మంది ఇంగ్లిష్, 8మంది బయోసైన్స్, 10మంది జీహెచ్‌ఎంలు, నలుగురు ఎల్‌ఎఫ్‌ఎల్‌లు ఉన్నారు. సన్మానానికి వచ్చే ఉపాధ్యాయులకు సీటు నంబర్లు కేటాయించారు.

వర్షంలో ఒంటి కాలిపై నిలుచుని..

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినూత్న ఆందోళన

సుల్తాన్‌బజార్: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో ప్రభుత్వ యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న అకౌంటెంట్స్, పీహెచ్‌సీ డీఈఓ, పీహెచ్‌ఎం, సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలో సోమవారం వర్షంలో ఒంటికాలిపై నిలుచుని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఎంస్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 510 జీఓలో విలీనం చేయాలన్నారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద ఎత్తున ఉద్యోగులు ఆందోళనలో పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, శ్రీమణి, శ్రీలక్ష్మి, భార్గవి, లోకేష్ పాల్గొన్నార

సారీ.. ఎయిర్‌పోర్టుకు రాలేం

- క్యాబ్‌వాలాల ‘లోఫేర్.. నో ఎయిర్’ మూవ్‌మెంట్

సాక్షి, సిటీబ్యూరో: క్యాబ్‌వాలాలు సరికొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు క్యాబ్ సేవలను నిలిపివేస్తూ ‘లో ఫేర్..నో ఎయిర్’ ప్రచారం చేపట్టారు. ఎయిర్‌పోర్టు నుంచి నడిపే క్యాబ్‌డ్రైవర్లకు సరైన ఆదాయం లభించకపోవడమే ఇందుకు కారణం. దీంతో సకాలంలో క్యాబ్‌లు లభించక.. ఒకవేళ సర్వీసులు బుక్ అయినప్పటికీ డ్రైవర్లు నిరాకరించడం వల్ల ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సకాలంలో క్యాబ్‌లు లభించక గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 65 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ఆర్టీసీ పుష్పక్ బస్సులు, ప్రీపెయిడ్ ట్యాక్సీలు, సొంత వాహనాలు మినహాయించి మరో 5 వేల క్యాబ్‌లు ఇటీవల వరకు ఎయిర్‌పోర్టుకు అందుబాటులో ఉండేవి. కానీ కొంతకాలంగా ఎయిర్‌పోర్టు నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడికి వెళ్లినా తమకు రూ.500 నుంచి రూ.700 వరకు మాత్రమే లభిస్తున్నాయని. దీంతో ఇంధన ఖర్చులు కూడా రావడం లేదని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఓలా, ఉబెర్ సంస్థలు డ్రైవర్ల నుంచి 30 శాతం వరకు కమీషన్ తీసుకుంటున్నాయి. ఇది మరింత భారంగా మారిందని తెలంగాణ గ్రిగ్ అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీపెయిడ్ ట్యాక్సీలకు ఒక ట్రిప్పుపైన రూ.980 నుంచి రూ.1150 వరకు లభిస్తుండగా తమకు మాత్రం అతి తక్కువ ఆదాయం లభిస్తుందన్నారు. దీంతో ఎయిర్‌పోర్టుకు క్యాబ్‌లు నడిపేందుకు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. ప్రీపెయిడ్ ట్యాక్సీల తరహాలో ఎయిర్‌పోర్టుకు నడిచే క్యాబ్‌లకు ప్రతి కిలోమీటర్‌కు రూ.21 చొప్పున ఇవ్వాలని, అగ్రిగేటర్ సంస్థలకు ఇచ్చే కమిషన్‌ను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలని క్యాబ్ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

చేతులు, కాళ్లు తాళ్లతో బిగించి.. చెరువులో పడేసి

- గోనెసంచిలో వేసి.. నడుముకు రాయికట్టి
- యువకుడి దారుణ హత్య



ప్రవీణ్(ఫైల్)

షాబాద్: చేతులు, కాళ్లు తాళ్లతో బిగించి.. గోనెసంచిలో వేసి.. నడుముకు రాయికట్టి చెరువులో పడేసి యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం మండల పరిధిలోని హైతాబాద్ చెరువులో ఓ గోనె సంచిలో మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. యువకుడి తలపై కొట్టి, కాళ్లు, చేతులు తాళ్లతో బిగించి, నడుముకు బండరాయి కట్టి గోనెసంచిలో వేసి పడేసినట్లు గుర్తించారు. మృతుడిని మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన కుమ్మరి ప్రవీణ్(31)గా గుర్తించారు.

వివాహేతర సంబంధమే కారణమా..?

ప్రవీణ్‌కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో పరిచయం ఏర్పడింది. అదికాస్తా ప్రేమగా మారింది. హత్యకు అక్రమ సంబంధమే కారణమై ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు కుమ్మరి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం



ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 11, 16వ వార్డుల కౌన్సిలర్లు రమావత్ మోహన్‌నాయక్, నరాల విశాలసాగర్‌తోపాటు ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొంద్రు ప్రవీణ్‌కుమార్ సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా నాగన్‌పల్లి గ్రామానికి చెందిన టీడీపీ, కాంగ్రెస్‌కు చెందిన లింగస్వామి, సునీత శ్రీరామ్, జన బీరప్ప, సతీష్ బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరినవారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే మంచిరెడ్డి తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



కేశంపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజు, కార్మికులు

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఈమేరకు సోమవారం ఆయన మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి తహసీల్దార్ అజీం అలీకి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు పెంచిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న మెనూను కాకుండా కొత్త మెనూను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, గుడ్లకు గతంలో ఇస్తున్న ధర కాకుండా మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని కోరారు. కార్మికులు రాములు, అక్కమ్మ, కళావతి, సత్తమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనం అందించాలి..

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ వెంకట్రాములుకు వినతి పత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు మాట్లాడుతూ.. మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రకటించిన విధంగా నూతన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులను చెల్లించాలన్నారు. సంఘం మండల కార్యదర్శి గీత, ఆ సంఘం సభ్యులు ప్రభావతి, అంజమ్మ, బాలమణి, సీఐటీయూ నాయకుడుశ్రీను పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

యువకుడి దుర్మరణం



వెంకటేశ్ మృతదేహం

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న ట్రాలీ ఎదురుగా వచ్చిన యాక్టివాను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏపీ.రంగా తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్(21) కొంతకాలంగా మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఉంటూ ఎలక్ట్రీషన్ పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో వెంకటేశ్ యాక్టివాపై నార్సింగి వైపు నుంచి అజీజ్‌నగర్‌కు వస్తుండగా గండిపేట చౌరస్తా సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంతో వచ్చిన ట్రాలీ ఆటో యాక్టివాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

72 కేసులు పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసమే లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు రిటైర్డు జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహించిన ట్రాఫిక్ పోలీసు కేసులకు సంబంధించిన లోక్ అదాలత్‌లో సోమవారం 72 కేసులు పరిష్కరించటంతోపాటు రూ.1,80,000 జరిమానాలు విధించినట్లు తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసులకు సంబంధించి ఈ లోక్‌అదాలత్ కొనసాగుతుందని చెప్పారు. ఈనెల 9వ తేదీ వరకు ఈ లోక్ అదాలత్ ఉంటుందని చెప్పారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సైదులు, ఎస్‌ఐ విశల్ రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

హయత్‌నగర్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. సంఘటన సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని కొహెడా గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దేవేందర్‌కు చెందిన గేదె గడ్డి మేస్తూ శ్రీ సాయి బాలాజీ వెంచర్‌లోకి వెళ్లింది. వర్షం పడడంతో తడిగా ఉండి కరెంటు షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రూ. లక్ష విలువైన గేదె మృతి చెందిందని, ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డరు. శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న ఓ కారు పిల్లర్ నెం:130 వద్ద ఆదివారం రాత్రి పక్కన ఆపారు. వెనుకాలే వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు గాయపడడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు.

బోనం.. ఘనం

వైభవంగా సోమన్న, పోచమ్మ, మహంకాళి బోనాలు

- ఆలయాల వద్ద బారులుతీరిన భక్తులు



యాచారం: అయ్యవారిగూడెంలో బోనాల ఊరేగింపులో భక్తులు

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి, అయ్యావారిగూడెం గ్రామాల్లో సోమవారం సోమన్న బోనాలు వైభవంగా జరిగాయి. మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, మాల్ గ్రామాల సరిహద్దులో ఉన్న సోమలింగేశ్వర స్వామికి ఆయా గ్రామాల గొల్ల కులస్తులు బోనాలు తీసుకెళ్లి నైవేద్యాన్ని సమర్పించారు.అయ్యవారిగూడెంలో కూడా సోమన్న బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అగ్నిగుండాలపై బోనాలతో నడుచుకుంటూ వెళ్తూ భక్తిని చాటుకున్నారు. మొండిగౌరెల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పోచమ్మ తల్లికి మారు బోనాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుమ్మరిగూడలో..

షాబాద్: శ్రావణ మసాన్ని పురస్కరించుకుని షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో మహంకాళి బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులో వెలసిన ఆలయంలో మొక్కులు చెల్లించారు. గ్రామ సర్పంచ్ కేతన, ఎంపీటీసీ అరుణ, కురుమ సంఘం అధ్యక్షుడు క్యామ నారాయణ, నరేందర్, కుమార్, శ్రీశైలం తదితరులున్నారు.

రావిచేడ్‌లో..

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో పోచమ్మ, ఈదమ్మ, మహంకాళి బోనాల పండుగను సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ఆలయాల్లో నైవేద్యం సమర్పించారు. సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ వెంకటేశ్, కులసంఘాల నాయకులు, వార్డుసభ్యులు ఉన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ తల్లి అమ్మవార్ల బోనాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరు, బాచుపల్లి, ధన్నారం, జైత్వారం, కొత్తూర్, మీర్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో బోనాలు, పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో సందడివాతావరణం నెలకొంది.



షాబాద్: మహంకాళి బోనాల ఊరేగింపు



యాచారం: అగ్నిగుండాలు దాటుతున్న మహిళలు



కడ్తాల్: రావిచేడ్‌లో బోనాల ఊరేగింపు



కందుకూరు: బోనాలతో మహిళలు

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



నారయ్య (ఫైల్)

యాచారం: మద్యానికి బానిసైన ఓ రైతు పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన అచ్చెన నారయ్య(55)కు ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన జంగమ్మతో 30 ఏళ్ల కింద పెళ్లి జరిగింది. కుటుంబ తగాదాలతో మనస్తాపానికి గురైన జంగమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి 25 ఏళ్లుగా నారయ్య తనకున్న ఎకరాన్నర వ్యవసాయ పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఒంటరిగా ఉంటున్న నారయ్య మద్యానికి బానిసగా మారాడు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగులమందు కూడా తాగేశాడు. కుటుంబ సభ్యులు గమనించి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం నారయ్య మృతి చెందాడు. భార్య జంగమ్మ, ఇద్దరు పిల్లలు నారయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: భిక్షాటన చేసుకుంటూ జీవించే ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శివరాంపల్లి ఎన్‌పీఏ గేట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (52) పడి ఉన్నాడని స్థానికులు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే ఆ వ్యక్తి రోడ్డుపై పడి చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. వివరాల కోసం స్థానికంగా వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదని, భిక్షటన చేసుకుంటూ రోడ్డుపై జీవించే వారడని స్థానికులు వెల్లడించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముంబై క్రైం పోలీసుల పేరు చెప్పి..

- నిషేధిత మెటీరియల్ అంటూ బెదిరింపులు
- నగర వ్యాపారి నుంచి రూ.29లక్షలు వసూలు

హిమాయత్‌నగర్: ముంబై క్రైం పోలీసులమని బెదిరించి నగర వ్యాపారి నుంచి సైబర్ నేరగాళ్లు భారీగా దోచేశారు. వారి మాటలకు భయపడిన వ్యాపారి అడిగినంత ముట్టజెప్పాడు. మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు సోమవారం సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల నగరానికి చెందిన వ్యాపారికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి 'ఫెడెక్స్' కొరియర్ ద్వారా మీరు తైవాన్‌కు నిషేధిత మెటీరియల్ సరఫరా చేస్తున్నందున మీపై కేసు నమోదు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముంబై సైబర్ క్రైం పోలీసులు ఫోన్ చేసి మరిన్ని వివరాలు సేకరించిన అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మరో వ్యక్తి ఫోన్ చేసి ముంబైలోని అంథేరి సైబర్ క్రైం ఠాణా నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పి వాట్సాప్ ద్వారా అతడి నుంచి పలు డాక్యుమెంట్స్ తీసుకున్నాడు. ముందుగా మీరు కొంత డబ్బు పంపితే డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ అనంతరం మీరు ఏ విధమైన నిషేధితమైన మెటీరియల్ పంపలేదని నిర్ధారణ అయితే డబ్బు వెనక్కి పంపుతామన్నారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యాపారి వారిచ్చిన ఖాతాలకు పలు దఫాలుగా రూ.29 లక్షలు బదిలీ చేశాడు. మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ శివమారుతి పేర్కొన్నారు.

న్యాయవాది ఆత్మహత్య

మణికొండ: కుటుంబ తగాదాల కారణంగా ఓ న్యాయవాది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ బెగోనియా అపార్ట్‌మెంట్స్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రనీల్ ముఖర్జీ(44) న్యాయవాదిగా పనిచేస్తూ భార్య, కుమారుడితో కలిసి పుప్పాలగూడలో నివాసం ఉండేవాడు. ఏడాది క్రితం భార్యతో గొడవలు తలెత్తడంతో ఆమె కుమారుడితో కలిసి వేరుగా ఉంటోంది. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయిన ఇంద్రనీల్ ముఖర్జీ ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని వద్ద గతంలో డ్రైవర్‌గా పనిచేసిన భాష ఉదయం నుంచి ఫోన్ చేస్తున్నా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో అతని తమ్ముడు మానవేంద్ర ముఖర్జీకి ఫోన్ చేసి సమాచారం అందించాడు. అనంతరం ఇద్దరు కలిసి వచ్చి చూడగా ఇంద్రనీల్ ముఖర్జీ ఇంటి తలుపులు మూసి ఉన్నాయి, పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో సెక్యూరిటీ గార్డుల సహాయంతో కిచెన్ గ్రిల్ తొలగించి లోపలికి వెళ్లి చూడగా ఇంద్రనీల్ ముఖర్జీ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని కిందికి దించి నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే అంజయ్య

షాద్‌నగర్: జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన న్యూపవర్ కుంగ్‌ఫూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మెట్రో గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల 16వ జాతీయ స్థాయి ఓపెన్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థులు కథాస్ విభాగంలో జంగం జశ్వంత్ బంగారు పతకాన్ని.. సాత్విక్, ఆదిశ, అన్విష్ వెండి పతకాలు.. వరలక్ష్మి, సంతోష్, యశ్వంత్ రజత పతకాలను కైవసం చేసుకున్నారు. అదేవిధంగా స్పైరింగ్ విభాగంలో సాత్విక్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్ల మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి సేవలు చిరస్మరణీయం



వీరారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి

కడ్తాల్: దివంగత రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీపాతి వీరారెడ్డి ఎక్వాయిపల్లి గ్రామానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన వీరారెడ్డి విగ్రహాన్ని అతిథుల సమక్షంలో కేఆర్ సురేశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎక్వాయిపల్లి గ్రామాభివృద్ధికి వీరారెడ్డి చేసిన సేలను వారు కొనియాడారు. అనంతరం పరమకర్మయోగి ధర్మదాత పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత ఆచారి, వీరారెడ్డి కుటుంబ సభ్యులు ఆహల్యాదేవి, శంకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఉమాదేవి, నిర్మలాదేవి, రమాదేవి, నర్సిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత రాఘవేందర్‌రెడ్డి, ఆచార్య వెంకట్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ ఉమావతి, బీజేపీ నేత వెంకటేశ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్

- 7 తులాల ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ సందీప్



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్

గచ్చిబౌలి: జల్సాల కోసం చైన్ స్నాచింగ్ బాటపట్టిన యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని డీసీపీ సందీప్ తెలిపారు. సోమవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. వివేకానందనగర్, బోరబండకు చెందిన రెల్ల కున్నమ్మ(53) ఆగస్టు 28 సాయంత్రం 6.15 గంటల సమయంలో భర్తతో కలిసి పర్వత్‌నగర్ రోడ్డులో వాకింగ్ చేస్తోంది. వెనక నుంచి వచ్చిన ఓ యువకుడు మెడలోని మంగళసూత్రం లాక్కొని ఉడాయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు చిన్న కొర్పోల్, నెక్కొండ మండలం , వరంగల్‌కు చెందిన మనుగురు మహిపాల్(27)గా గుర్తించారు. 2014లో నగరానికి వలస వచ్చి తులసీనగర్, బోరబండలో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడటంతో కూలీ డబ్బులు సరిపోక చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించగా తానే స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 13న అల్లాపూర్ పీఎస్ పరిధిలో సజ్జా సత్యవతి నడుచుకుంటూ వెళుతుండగా పుస్తెల తాడుతో ఉడాయించినట్లు ఒప్పుకున్నాడు. ఆ రెండు కేసుల్లో 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులను డీసీపీ అభినందించారు. వాకింగ్‌కు వెళ్లినప్పుడు నగలు వేసుకోవద్దని జాగ్రత్తగా ఉండాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, డీఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.